

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# జొన్నవాడ కామాక్షితాయిని దర్శించుకున్న

## దేవాదాయ ప్రాంతీయ సంయుక్త కమిషనర్



**బుచ్చి సెప్టెంబర్ 26 ప్రభాతవార్త** పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జున స్వామి కామాక్షితాయి సన్నిధిలో జరుగుతున్న శరన్నవరాత్రి వేడుకలలో దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఆర్యభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో అతిధులకు స్వాగతం పలికారు. అనంతరం అతిదులు ఆలయ ప్రదక్షణం చేసి శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అతిధులు గోత్రనామములతో శ్రీమల్లికార్జునస్వామి వారికి సహస్రనామార్చన పూజ, శ్రీకామాక్షితాయి అమ్మవారికి ఖడ్గమాల పూజ, శ్రీలక్ష్మీ గణపతి స్వామి స్వామి వారికి, శ్రీసుబ్రహ్మణేశ్వరస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి అతిధులను శేష వస్త్రంతో సత్కరించి, శ్రీవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 16190 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 72.559 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 250, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.837 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# ప్రజల జీవన ప్రమాణాలలో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకం

## - జిల్లా కలెక్టర్ హిమాన్శు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు సహకారం అందించాల న్నారు. రైతులకు సమయానుకూలంగా వారి అవసరాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు రొటావేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, కట్టర్స్, లెవలింగ్ బ్లేడ్స్ మొదలైన వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ పరికరాల ద్వారా రైతుకు వ్యవసాయ పనుల సులభతరంతో పాటు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. జిల్లాలో వున్న 70 వేల ఎకరాల సాగులో లేని భూమిని సాగులోనికి తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమన్న కలెక్టర్, ఇందుకు బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలన్నారు. చిరువ్యాపారులకు ప్రధానమంత్రి ముద్రా యోజన రుణాలు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థికస్వావలం బనకు రుణాలు మంజూరు చేయాలన్నారు. విద్యారుణాలను విరివిగా మంజూరు చేసి విద్యార్థులకు చేయూతనివ్వాల న్నారు. రైతులకు సిసిఆర్ కార్డులను త్వరగా మంజూరు చేయాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రోత్సహించేలా రుణాల ఇవ్వాలన్నారు. ఈ పథకంపై స్వయం సహాయక మహిళలకు పూర్తిగా అవగాహన కల్పించాలని డిఆర్డిఏ పీడిని ఆదేశించారు. ప్రభుత్వాలు ప్రజల అభ్యున్నతి కోసం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు బ్యాంకర్లు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. తొలుత గత సమావేశంలో చర్చించిన వివిధ అంశాల పురోగతిని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వ్యవసాయ రంగంలో రైతుల యంత్ర పరికరాల వినియోగం, వాటి ఉపయోగాలు, కొనుగోలు ధర మొద్కలెన వివరాలతో కూడిన ప్రజంటేషన్‌ను జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి వివరించారు. తక్కువ సమయంలోనే వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం, లాభాలపై పూర్తి సమాచారంతో ప్రజెంటేషన్ ఇచ్చిన వ్యవసాయ శాఖ అధికారిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్, నాబార్డు డిడిఎం బాబు, డిఆర్‌డిఎ పీడీ నాగరాజాకుమారి, మత్స్య, పశుసంవర్థకశాఖల జెడిలు శాంతి, రమేష్‌నాయక్, ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌చే వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

## - రబీ 2025 పోస్టర్ విడుదల




**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ – రబీ 2025 పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ హిమాన్శు శుక్ల, జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లలిత శివజ్యోతి, సిబ్బంది సమక్షంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ అభియాన్‌ను భారత ప్రభుత్వ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 3 నుంచి 18 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దీని ముఖ్య ఉద్దేశ్యం రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, శాస్త్రీయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం. దీని ప్రధాన అంశాలు మెరుగైన విత్తన రకాలు, సమగ్ర ఎరువు పురుగు యాజమాన్యం పై అవగాహన కల్పించడం, ఆధునిక యాంత్రిక పద్ధతులు, ప్రెసిషన్ వ్యవసాయం ప్రదర్శనలు చేయడం, నేల ఆరోగ్యం, నీటి వినియోగ సమర్థత, ప్రకృతి వ్యవసాయం గురించి సూచనలు ఇవ్వడం, ప్రభుత్వ పథకాలు, పంట బీమా, రుణ సౌకర్యాలు, మార్కెట్ అవకాశాలు గురించి అవగాహన కల్పించడం, రైతుల వినూత్న ఆవిష్కరణలకు ప్రోత్సాహం చేయడమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు నిపుణుల ప్రత్యక్ష సలహాలు పొంది ఆదాయం పెంపు, స్థిరమైన వ్యవసాయం, ఆహార భద్రత సాధనలో ముందడుగు వేయగలరని కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు జిల్లా రైతులందరినీ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ – రబీ 2025లో చురుకుగా పాల్గొనాలని కోరింది. ఇది వికసిత్ భారత్ – 2047 లక్ష్య సాధనకు పునాది అవుతుంది అని తెలిపారు.

# నకిలీ పోలీస్ అరెస్ట్

## - ఉద్యోగాలిప్పిస్తామంటూ పలువురికి రూ. లక్షల్లో మోసం



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** విజయవాడలో క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అని చెప్పి తన పలుకుబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని మోసం చేసి లక్షల్లో నగదుగా కాజేసిన నిందితుడిని, అతనికి సహకరించిన అతని తండ్రిని వేదాయపాలెం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... న్యూ మిలటరీ కాలనీకి చెందిన తూపిలి వినోద్ కుమార్‌ను స్థానిక తెలుగు గంగ కాలనీ ఎదురుగా ఉన్న రాయల్ రెసిడెన్సిలో నివసించే దేవళ్ల సాయి కృష్ణ అనే వ్యక్తిఅనే వ్యక్తి తాను విజయవాడ క్రైమ్ బ్రాంచ్‌లో ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు పరిచయం చేసుకున్నాడు. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్న వినోద్ కుమార్‌కు తన పలుకుబడితో అటవీ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన వినోద్ కుమార్ పలు దఫాలుగా రూ.10 లక్షలకు పైబడి నగదు అందజేశాడు. ఎంతకీ ఉద్యోగం ఇప్పించకపోవడంతో సాయి కృష్ణ గురించి వాకబు చేయగా అతను పోలీస్ డిపార్ట్మెంట్ కు చెందిన వ్యక్తి కాదని తెలియడంతో మోసపోయానని గ్రహించి వేదాయపాలెం పోలీసులకు బాధితుడు ఈ నెల 24వ తేదీ ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన వేదయపాలెం స్టేషన్ సీఐ కే శ్రీనివాసరావు విచారణలో ఇదే తరహాలో సాయి కృష్ణ పలువురిని ఉద్యోగాల పేరుతో మోసం చేసి రూ. 51లక్షలు నగదు తీసుకున్నట్లు వెల్లడైంది. సాయి కృష్ణ తండ్రి తూపిలి పోలయ్య సహకారంతోనే సాయి కృష్ణ ఇటువంటి మోసాలకు పాల్పడ్డాడని, మోసం ద్వారా సంపాదించిన నగదును పోలయ్య బ్యాంకు ఖాతాలో ఉంచుతూ స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితులిద్దరిని అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుండి డూప్లికేట్ పోలీస్ ఐడి కార్డు, వైద్యుడి పేరుతో డూప్లికేట్ ఐడి కార్డు, పోలీస్ అధికారులు ధరించే యూనిఫామ్, సాక్సులు బ్యాడ్జీలు, బీఎండబ్ల్యూ కారు, ఒక స్కూటీ, రెండు ఖరీదైన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తక్కువ సమయంలో పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన వేదయపాలెం సిఐ కె శ్రీనివాసరావు, ఎస్సై శ్రీనివాసరావు ఇతర స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, నగర డి.ఎస్.పి సింధుప్రియలు అభినందించారు.

# జెడ్పీలో నేడు ఏడు స్థాయి సంఘ సమావేశాలు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** నేడు నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం నందు నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ ఏడు (07) స్థాయీ సంఘ సమావేశములను జరుపునట్లు జిల్లా పరిషత్ సీఈవో మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పంచాయితీ రాజ్ శాఖతో సమీక్ష, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, సాంఘీక సంక్షేమ, తదితర అంశాలపై సమీక్షా నిర్వహిస్తున్నట్టు జడ్పీ సీఈవో విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- జీఎస్టీ 2.0తో ప్రజలకు, వ్యాపారులకు మేలు
- ఎంపీ వేమిరెడ్డి ఆదేశాలతో ఐదవ రోజు అవగాహన కార్యక్రమం
- క్షేత్రస్థాయిలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారు



**నెల్లూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త –వైద్యం** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. జీఎస్టీతో 2.0తో అన్నింటా రేట్లు తగ్గి సామాన్య ప్రజలకు ఊరట దక్కుతోందని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు జీఎస్టీ 2.0 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఐదో రోజు శుక్రబారం నెల్లూరు సిటీ పరిధిలోని సంతపేట నాలుగు కాళ్ల మండపం సెంటర్‌లో నిర్వహించారు. స్థానిక వ్యాపారులకు, ప్రజలకు, దుకాణదారులకు జీఎస్టీ 2.0 ద్వారా కలిగే లబ్ధిని వివరించారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. దీని ద్వారా ప్రజల పొదుపు పెరుగుతుందని పేర్కొన్నారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీ నేడు 2 స్లాబులకు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా దాదాపు 83 రకాల వస్తువుల ధరలను తగ్గించిందన్నారు. పాల ఉత్పత్తులు, హార్డ్ వేర్, బ్యూటీ ప్రోడక్ట్స్, నిత్యవసరాలు వంటి అన్ని రకాల వస్తువులు తగ్గడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల స్థానికంగా వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆర్థిక మంత్రి సీతారామన్ నిర్ణయాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణన వంటి వారు సమర్ధించి సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. గత ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డిని, మంత్రిగా నారాయణను గెలిపించిన ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన గిఫ్ట్ జీఎస్టీ 2.0 అని వెల్లడించారు. మొబైల్స్, టీవీలు, ఏసీలు, కార్లు, కంప్యూటర్లు, బైక్ వంటి అన్ని వస్తువుల ధరలు తగ్గుదలతో ప్రజలకు అందబాటులోకి వచ్చాయన్నారు. జీఎస్టీ ద్వారా వచ్చిన పనున్నలను రోడ్లు, రైల్వేలు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్రం ఖర్చు చేస్తోందని అన్నారు. జీఎస్టీ ద్వారా దాదాపు 2 లక్షల కోటన లప్రజాధనం మార్కెట్‌లోకి వస్తుందని కేంద్రం అంచనా వేసిందని, దీని ద్వారా నాగదు చామనీ పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా అధ్యక్షురానలు కప్పిర రేవతి, కనకేశ్వరరావు, వినయ్, కిషోర్ సింగ్, జాన్ డేవిడ్, వాసు, కుక్క ప్రభాకర్, ఝాన్సీ, చైతన్య, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మాతమ్మ తల్లిని దర్శించుకున్న కావలి ఎమ్మెల్యే



**కావలి, సెప్టెంబర్26, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మాతమ్మ తల్లిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గురువారం రాత్రి దర్శించుకుని పూజలు నిర్వహించడం జరిగింది ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దగుమాటికి గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి ఆయనను దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. మాతమ్మ తల్లి ఆశీస్సులు కావలి నియోజకవర్గం ప్రజలకు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సురే శ్రీనివాసరెడ్డి, చింతం బాబుల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు

## - జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** జిల్లాలో ఎడగారులో రైతులు పండించిన ధాన్యం, ప్రభుత్వమే కొనుగోలు, చేసేలా చర్యలు చేపడుతున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జెసి చాంబర్లో వార్త దినపత్రికతో జిల్లాలోని విషయాలు పంచుకున్నారు. అలాగే పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి, పడకుండా ప్రతిష్ట చర్యలు చేపడుతున్నామని సందర్భంగా జెసి తెలియజేశారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలపై జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని, నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో తమ చాంబర్లో తెలియజేశారు.

# శ్రీవారి సింహ వాహన సేవలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



**కోవూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం ఉదయం మలయప్ప స్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సేవలో కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మ విష్ణు శివాత్మకమైన నరసింహ స్వామి రూపంలో ఉన్న మళయప్ప స్వామి పరాక్రమానికి ప్రతీకగా భావించే సింహ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమివ్వడంతో భక్తులు పూర్తిస్థాయిలో ఆనందపరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి అశోక్ సింగాల్, తదితరులు ఉన్నారు.

# స్మార్ట్ స్ట్రీట్ పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన : డైరెక్టర్ తేజ్ భరత్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ తో కలిసి స్థానిక మైపాడు రోడ్డు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ పైలట్ ప్రాజెక్టును శుక్రవారం సందర్శించారు. పట్టణ పురపాల శాఖ మంత్రి పి. నారాయణ ఆలోచనల మేరకు వీధి వ్యాపారస్తులకు ఆర్థిక ఉన్నతిని కల్పించే దిశగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టు నిర్మాణ పనులను మెప్మా పీడీ పరిశీలించి వివిధ అంశాలను కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు. కంటైనర్లను దుకాణాలుగా రూపొందించడం, పార్కింగ్ వసతి, డైనింగ్ సదుపాయం, పచ్చదనం, పరిశుభ్రత తదితర అంశాలతో స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్ట్ ఆసక్తికరంగా ఉందని ఆయన అభిప్రాయం వెలిబుచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, ప్రాజెక్టు పూర్తి అయితే ఎంతమంది లబ్ధిదారులకు మేలు చేకూరుతుంది, స్మార్ట్ స్ట్రీట్ పైలెట్ ప్రాజెక్టు నిర్వహణ తదితర అంశాలను మెప్మా ఎండి కార్పొరేషన్ కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

## హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ అన్వర్ భాష




**కందుకూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** పట్టణంలోని హిజ్రాలకు కందుకూరు సీఐ ఎస్.కె అన్వర్ భాష శుక్రవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ కందుకూరు పట్టణ పరిధిలో ఏమైనా ఓపెనింగ్ లు, వివాహాలు, శుభకార్యాలు, షాపుల వద్ద కి, ఇతరుల వద్దకు వెళ్లి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం చేయకూడదన్నారు. దౌర్జన్యం చేయటం, భయభ్రాంతులకు గురిచేసి వారి దగ్గర బలవంతంగా డబ్బులు లాక్కోవటం వంటివి చేసిన యెడల మీపై చట్టపరంగా నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హిజ్రాలను హెచ్చరించారు.

# నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మందిరంలో ఏర్పాటు



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** నెల్లూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మందిరం లో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ శుక్రవారం పాల్గొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న వివిధ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదరిక నిర్మూలన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్, మున్సిపల్ మాజీ చైర్మన్ తాళ్లపాక అనురాధ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, స్వయం సహాయక బృందాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ఫ్రైడే డ్రైడే



**ఆత్మకూరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరుపాళెం ఎస్సీ కాలనీని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ తనిఖీ చేశారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్సీ కాలనీని విజిట్ చేశారు. కాలనీలో ఇంటింటికి వెళ్ళి నీటి తొట్లను, డ్రమ్ములను తనిఖీ చేసి లార్వాను గుర్తించి దొర్లించారు. పరిసరాల్లో ఎటువంటి కొబ్బరి చిప్పలు, టైర్లను ప్లాస్టిక్ డబ్బాలు, వాడుకలో లేని వస్తువులు వెంటనే తీసివేయాలన్నారు. ఈ వస్తువులు వలన నీరు నిల్వ ఉండి ఎడిస్ దోమ, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని అలాగే ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాల్టీ కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ డబ్బాలు వేయకూడదన్నారు. వర్షాకాలంలో తాజాగా వేడిగా ఉండే ఆహారం తీసుకోవాలని నీరు కాచి చల్లార్చుకొని తాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్ఇఒ ఎస్.సుధాకర్, ఎంపిహెచ్ఎ(మేల్) జి.రవీంద్రరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## కోవూరు శాశ్వత ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి :కరకట్ట మల్లికార్జున్



**కొడవలూరు సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాశ్వత ఎమ్మెల్యేగా కొనసాగుతారని టిడిపి నాయకులు కరకట్ట మల్లికార్జున్ పేర్కొన్నారు. శుక్రవారం నార్త్ రాజుపాలెం పి ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో కోవూరు నియోజకవర్గ స్థాయి టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు చేసిన అరాచకాలు ఈరోజు అనుభవిస్తున్నారని ప్రతి ఒక్కరికి ఒక రోజు అంటూ వస్తుందని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రౌడీయిజం, దాడులు, ఎస్సీ ఎస్టీ తప్పుడు కేసులు నమోదు చేయించి టిడిపి నాయకులను అనేక ఇబ్బందులు పెట్టిన వైకాపా నేతలు కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మండపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, బండి కిరణ్ కుమార్, మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు తువ్వారా ప్రవీణ్ కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి హౌసింగ్ ఏఈ గా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణ



**కొడవలూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**కొడవలూరు మండలం ఇన్చార్జి హౌసింగ్ ఏఈ గా వంశీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే స్వచ్ఛందంగా తెలియపరచి వారి సమస్యలను పరిష్కారం చేసుకోవాలని తెలియజేశారు. త్వరలోనే నూతన పక్కా గృహాలు ప్రభుత్వం నుండి మంజూరు కావడం జరుగుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మాణం కోసం ప్రభుత్వము నుండి వచ్చే మెటీరియల్ సకాలంలో అందజేసి దశలవారీగా బిల్లులు లబ్ధిదారుడి అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

## మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ



**కలిగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మహిళల ఆరోగ్యమే ప్రదానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందని కలిగిరి మండలంపోలంపాడు ,రావుల కొల్లు సర్పంచిలు కల్లూరి రేష్మ, పూసల వెంగపనాయుడులు తెలిపారు. శుక్రవారం పోలంపాడులో పాఠశాల ఆవరణంలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అబియాన్ కార్యక్రమం జరిగింది. కలిగిరి ప్రాధమిక వైద్యశాల వైద్యధికారి బిజ్జం గీతారెడ్డి ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలకు, బాలబాలికలకు,గర్భిణీ స్త్రీలకు హెచ్‌బి పరీక్షలు,రక్తపోటు, మదుమేహంలాంటి పరీక్షలునిర్వహించారు. మహిళలకు వివిద రకాల క్యాన్సర్ వాదులకు సంభందించి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య శిబ్బంది మేరి,ఏయన్‌యం లక్ష్మీ,బి. సౌమ్య, , నరసయ్య, మహాలక్ష్మి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాతబిట్రగుంట లో రామిరెడ్డి పరామర్శ



**బిట్రగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** బోగోలు మండలం పాత బిట్రగుంట కు చెందిన ఉప్పాల మోహన్ ఇటీవల కాలంలో అనారోగ్యం తో హాస్పిటల్ లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన సందర్భంగా శుక్రవారం కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు పాతబిట్రగుంట గ్రామంలో వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. ఆయన వెంట మండల వైసీపీ నేతలు పాల్గొన్నారు

## నూతన జీఎస్టీ పాలసీ సామాన్యులకు ఊరట



**వింజమూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** నూతన జీఎస్టీ పాలసీ సామాన్యులకు ఊరట కలిగిస్తుందని వింజమూరు తెలుగుదేశం మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి కో కన్వీనర్ మంచాల శ్రీనివాసులునాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ విధానం వల్ల సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే అన్ని వస్తువుల ధరలు తగ్గాయని దాంతో అవసరమైన వస్తువులు కొనుగోలు చేసే అవకాశం లభించింది అన్నారు. జీఎస్టీ ద్వారా విలాస వస్తువులను కొనుగోలు చేసే శక్తి లేని మధ్య తరగతి సామాన్య కుటుంబాలకు చెందిన వారికి వరంగా మారిందని తెలిపారు. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకంలోని మొట్టమొదటి హామీ మెగా డీఎస్సీ ని ప్రకటించి 16347 ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే గురువారం రాజధాని నగరంలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొట్టమొదటి సంతకం చేసిన మెగా డీఎస్సీ సకాలంలో ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేయడం కూటమి ప్రభుత్వం యొక్క ఘనత అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొనడం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే మన ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అనుకున్న విధంగా అమలు చేస్తూ వస్తుందని తెలిపారు.

## సీనియర్ అడ్వకేట్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**బిట్రగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** అనారోగ్యం కారణంగా నెల్లూరు డి ఎస్ ఆర్ న్యూరో కేర్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న బోగోలు మండలం విశ్వనాధరావుపేట కు చెందిన సీనియర్ అడ్వకేట్ మరియు కావలి వైస్సార్సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు కెనడిని పరామర్శించిన కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్బంగా ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి కెనడి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. అయన వెంట మండల వైసీపీ కన్వీనర్ ఎం. వీరరఘు తోపాటు కావలి, బోగోలు మండలాల వైసీపీ నేతలు ఉన్నారు.

## బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలి

## అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే



**బిట్రగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** కావలి నియోజకవర్గం లోని బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యాలు మెరుగవడంతో పాటు విపరీతమైన ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం అసెంబ్లీలో పేర్కొన్నారు. లాజిస్టిక్స్ రంగంపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు సభాపతికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు, రైలు, వాయు, సముద్ర మార్గాల అనుసంధానంతో లాజిస్టిక్ హబ్‌లకు ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. మన రాష్ట్రం వనరులకు కొదవలేని స్థితిలో ఉందన్నారు. విజనరీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు. ఇలాంటి సమయంలో మా కావలి నియోజకవర్గంలోని బిట్రగుంటలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు అత్యవసరం అని చెప్పారు. కృష్ణపట్నం పోర్టు ఇప్పటికే రాష్ట్రానికి గుర్తింపు తెచ్చుకుందని, త్వరలో రామాయపట్నం పోర్టు కూడా ప్రారంభమవుతోందని గుర్తుచేశారు. దామవరం సమీపంలో ఎయిర్‌పోర్ట్, జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ ఏర్పడుతున్నాయని వివరించారు. బిట్రగుంటలో 925 ఎకరాల రైల్వే భూమి ప్రస్తుతం ఖాళీగా ఉందని, అక్కడ మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తే కంటైనర్ డిపోలు, గోదాములు, ప్యాకింగ్ సెంటర్లు, బ్రేకింగ్ యార్డులు అభివృద్ధి చేయవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రామాయపట్నం పోర్టు కేవలం 28 కి.మీ., కృష్ణపట్నం పోర్టు 53 కి.మీ. దూరంలో ఉండటాన్ని ఆయన గుర్తు చేశారు. నేషనల్ హైవే కేవలం అర కిలోమీటరులోనే ఉండటంతో రవాణా సౌకర్యాలు విస్తరించనున్నాయని చెప్పారు. లాజిస్టిక్ పార్క్ ద్వారా రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సరుకులు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు త్వరగా చేరతాయని అన్నారు. జీడీపీ ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. చెన్నై, బెంగళూరు, సింగపూర్‌లలో లాజిస్టిక్ హబ్‌ల వల్ల వేలాది ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, అలాంటి అవకాశాలు నెల్లూరు జిల్లాలో కూడా కలుగుతాయని ఉదాహరణగా చెప్పారు. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాలతో పాటు మొత్తం నెల్లూరు మెట్ట ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ విషయం లో అసెంబ్లీ ద్రుష్టి కి తీసుకోని వచ్చిన ఈ సమస్య ను కేంద్రప్రభుత్వం ద్రుష్టికి తీసుకుని వెళ్లి ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని కోరారు

## మోడల్ గ్రామాలు పరిశీలన ఎంపీడీవో నగేష్ కుమారి



**కొడవలూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మండలంలోని మోడల్ గ్రామాలను విడవలూరు ఎంపీడీవో నగేష్ కుమారి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాలను పరిశీలన చేశారు.కొడవలూరు మండలంలోని వెంకన్న పురం, గుండాలంపాలెం గ్రామాలలో ఉన్న పాఠశాల, చెత్త సంపద కేంద్రం, అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న పరిశుభ్రత, మరుగుదొడ్లు పరిశీలన చేయడం జరిగిందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జగదీష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ఎం. ఆర్.సి.సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాపూరు బిట్ 3 సచివాలయంలో స్వస్త్ నారీ..స్వశక్త్ పరివార్



**రాపూరు,సెప్టంబరు26ప్రభాతవార్త :** రాపూరు పంచాయితీ పరిధిలోని మద్దెలమడుగు బిట్ 3 సచివాలయం ప్రాంగణంలో శుక్రవారం స్వస్త్ నారీ..స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా రాపూరు కో లోకెటడ్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుదర్శన ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఆరోగ్య పరిక్షలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్యపరిక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిపి,షుగర్ వ్యాధి పరిక్షలను ప్రత్యేకంగా నిర్వహించారు. ప్రతి మహిళ క్రమం తప్పకుండా ఆరోగ్య పరిక్షలను నిర్వహించుకుంటూ వారి ఆరోగ్యంపై జాగ్రత్తగా వుండాలని డాక్టర్ సుదర్శన కోరారు. ఈ వైద్యశిబిరంలో పంచాయితీ సర్పంచ్ భూపతి జయమ్మ,వార్డు సభ్యురాలు ఆరీఫా, తెలుగుదేశం పార్టీ నాయకులు సమయం ప్రసాద్, వేమయ్య, వెంకయ్య, గోర్ల వెంకటేశ్వర్లు యాదవ్, భూపతి జయరామయ్య,ఆరోగ్య కార్యకర్త హరిత, బిట్ 2 సిహెచ్‌ఓ రత్న, పలువురు ఆరోగ్య సిబ్బంది,ఆశాలు, సచివాలయం సిబ్బంది, తదితరులున్నారు.

## పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**లింగసముద్రం సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**పోషక విలువలు కలిగిన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసిడిఎస్ పెద్దపవని సెక్టార్ సూపర్ వైజర్ రాధాదేవి అన్నారు. మండలంలోని ముత్యాలపాడు అంగన్వాడీ సెంటర్లో సీడీపీఓ కే. మాధవిలత సూచనల మేరకు 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంత మైన మహిళ శక్తివంతమైన కుటుంబా నికి బలమైన పునాది అన్నారు. స్థూలకాయ నివారణకు నూనె, ఉప్పు. చక్కెర జంక్ ఫుడ్స్ వినియోగం తగ్గించాలని మనకు లభించే పండ్లు కూరగాయలు మిల్లెట్స్ వినియో గాన్ని పెంచాలని, మన కుటుంబంలో ప్రతి ఒక్కరూ బాల్యం నుంచి వృద్ధుల వరకు సమతుల పోషకాహారం తీసుకోవాలని మన ఆరోగ్య జీవనశైలిని మంచి పోషకాహారం తీసుకుని మార్చు కోవాలన్నారు. అంగన్వాడీ సెంటర్లో లబ్ధిదారులకు లభించే సేవలు అన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## జుమ్మా మసీదుకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు భూమిని ఆక్రమణల చెర నుంచి విడిపించండి

**- ముస్లిం మైనార్టీలకు స్మశాన వాటికల సదుపాయం కల్పించండి**



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో ముస్లింలకు చెందిన వక్ఫ్ భూములు అనేకం అన్యాక్రాంతమై ఉన్నాయని, దీంతో ముస్లింల స్మశాన వాటికలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముస్లిం మైనార్టీ నేత, హసన్ బేగ్ తెలియజేశారు. ఈ మేరు శుక్రవారం నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హసన్ బేగ్ మాట్లాడుతూ నెల్లూరు నగర పరిధిలో 42, 43, 44, 48 వార్డు ప్రాంతాలలో 90 శాతం ముస్లింలే ఉన్నారని తెలిపారు. అక్కడ ఆల్తాలిమ్ మసీదుకు సంబంధించిన స్మశానం ప్రస్తుతం లేదని తెలిపారు. దీంతో ఆ ప్రాంతాలలో ఉన్న ముస్లింలంతా స్మశాన వాటిక లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అలాగే కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో పడమర వైపుగా ఉన్న జుమ్మా మసీదు అనుబంధ స్మశానం కూడా అన్యాక్రాంతమైందని వివరించారు. జుమ్మా మసీదుకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు భూమి 13 ఎకరాల పై చిలుకు ఉంటుందని తెలిపారు. దీన్ని ఆక్రమణల చెర నుంచి విడిపించి అందులో కనీసం 5 ఎకరాల భూమిని ముస్లింల స్మశానం కొరకు కేటాయించాల్సిందిగా కోరుతున్నట్లు వివరించారు.

## ఊటుకూరులో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్



**వింజమూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఊటుకూరు పంచాయతీ లో వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి, మహిళల సంపూర్ణ ఆరోగ్యం కొరకు స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ముందుగా వైద్య ఆరోగ్య ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం వైద్యాధికారి మస్తాన్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న వైద్య శిబిరాలు వలన మహిళల్లో వివిధ రకాలైన వ్యాధుల గురించి అవగాహన కల్పించి, వైద్య చికిత్సలు చేయటం జరుగుతుందని, వ్యాధుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరంలో ముఖ్యంగా ఎత్తు వయసుకు వచ్చిన బాలికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన నియమాలను గురించి తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌రొద్దా వెంగమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొండయ్య, బీజేపీ మండల అధ్యక్షులు మధు యాదవ్, రమేష్, సీహెచ్ సక్కుబాయి, హెచ్ఈ వెంకట సుబ్బయ్య, సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, లీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, జానకి, ఏఎన్ఎంలు, మానస, విజయశ్రీ, అరుణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అమ్ములు, లక్ష్మమ్మ, నమోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, సుబ్బరత్తమ్మ, చెన్నమ్మ, రాధా, సుజాత, స్వచ్ఛ భారత్, పుల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిహెచ్సి లో వైద్య శిబిరం



**బిట్రగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**స్వస్త్ నారి శష క్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోవూరు పల్లి నందు శుక్రవారం ప్రముఖ కాన్పులు మరియు ప్రసూతి వైద్యులు డాక్టర్ మల్లి. పద్మ హాజరు అయి గర్భిణీ స్త్రీలు మరియు జనరల్ 72 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నిత్య ప్రశాంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నజీమున్నిసా , పీ హెచ్ యెన్ పద్మావతి, ఐ సి డి ఎస్ సి డి పీ ఒ , ఐ సిడిఎస్ సూపెర్వైసోర్ సుప్రజ, వైద్య సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది. అదేవిధంగా ఎస్ .వి . పాలెం గ్రామంలో కూడా స్వస్త్ నారి శష క్త్ పరివార్ అభి యాన్ ప్రోగ్రామ్లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. 54 మంది వైద్య సేవలు వినియోగించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నాగి.ఆదిశేషు, కాకి . తిరుపతి,పొగడం కొండారెడ్డి, పుట్టి . బ్రహ్మయ్య, రాజు.నాగార్జున,రామలింగం .నాగరాజు,రాజు. శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, హెల్త్ సూపెర్వైసోర్ వసంత, ఐ సి డి ఎస్ సూపెర్వైసోర్ హైమవతి, పంచాయత్ సెక్రటరీ వేణుగోపాల్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్( ఎం ఎల్ హెచ్ పీ ఎస్ ), ఏ యెన్ ఎం ఎస్ , ఆషా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, 104 ఎం ఎం యూ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది .27092025 న వి .యెన్ .ఆ ర్ .పేట 1 మరియు వి .యెన్ .ఆర్ .పేట 2 నందు స్వస్త్ నారి శష క్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది

## విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గిరిజనుడి ఇల్లు దగ్ధం



**సంగం సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** సంగం మండలం చెన్నవరపాడు గ్రామంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో రాగి తేజా అనే గిరిజనుడు కి సంబందించిన పూరిల్లు దగ్ధం అయింది. ఇంట్లో వున్న ఎలక్ట్రానిక్ వస్తువులు. ఇంట్లో సామను. అన్ని వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యా యి. సుమారు రెండు లక్షల రూపాయాలు వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.కట్టుబట్టలతో బిడ్డలతో వీధిన పడ్డ ఆగిరిజనుడి కుటుంబాన్ని ఆదుకోవాలని పలు వురు కోరారు.

## పించన్ పంపిణిలో అంగన్‌వాడీలను మినహాయించండి



**బుచ్చి సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతి నెల పంపిణి చేసే సామాజిక పెన్షన్ల కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలను మిన హాయించాలని సిఐటియు ఆద్వర్యంలో శుక్ర వారం కార్యకార్తలు ,నాయకులు సిఐటియు ఆద్వర్యంలో సంబందిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండలంలో ఎక్కడ లేని విధంగా ఒకటోవ సచివాయం, అదేవిధంగా పల్లాపల్లిలో మూడో సచివాలయంలో అంగన్ వాడీ టీచర్లను పెన్షన్లు పంపిణి చేయమని అధికారులు బత్తిడి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం గత నెల నుండి అంగన్‌వాడీ కార్యకర్తలను పెన్షన్ల పంపిణిలో మినహాయించింది, అక్టోబర్ నుండి వీరు పంపిణి చేయ డంలేదని ఆధికారులకు తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, సుమ,అనిత, సుప్రజా, అనూషా, సుబాషిని తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు వరం: మెగా డీఎస్సీ



**వింజమూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** మెగా డీఎస్సీ ద్వారా పదహారు వేల మందినిరుద్యోగులకు ఉద్యోగ కల్పన ప్రభుత్వం కల్పించడం గర్వకారణం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ- 2025 నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆనందంగా ప్రసంగించారు. డీఎస్సీ ఏర్పాటు తొలి సంతకం పై వివరనాత్మకంగా ప్రసంగించారు. మీకు ఉద్యోగాలు కల్పించి, మీ కుటుంబాలకు అండగా నిలిచానని విద్యార్థుల భవిష్యత్తును మీరు తీర్చిదిద్దాలని, సందేశం ఇచ్చారు. ఉద్యోగాల ఫలితంగా సమాజాన్ని ఆదర్శంతంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే సమయంలో గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న మీరు ఆ వృత్తికి వన్నె తెచ్చే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మీపై ఉంటుందన్నారు. కనుక ఆ బాధ్యతను సక్రమంగా నెరవేర్చి సమాజంలో గౌరవాన్ని పొందాలని సూచించారు.

## పేదల అభివృద్ధికి తోడ్పడేది టీడీపీ: దొడ్ల



**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** పేదల అభివృద్ధికి తోడ్పడే పార్టీ టీడీపీ ప్రభుత్వమని అమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత దొడ్ల మల్లిఖార్జున అన్నారు. ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామం పేదల అభ్యున్నతికి పాటుపడుతూ పేదల అభివృద్ధికి తోడ్పడే పార్టీ టీడీపీ ప్రభుత్వమని అమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత దొడ్ల మల్లిఖార్జున అన్నారు. గురువారం మండలంలోని కుడితిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన నివాసిత గృహాలకు స్లాబులు వేశారు. ఈ గృహ నిర్మాణాలను కుడితిపాలెం టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణానికి రూ.3220 కోట్లు అదనపు సాయం కింద ఏపీ ప్రభుత్వం మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అందులో భాగంగా కుడితిపాలెం కాకర్ల దిబ్బ గిరిజన కాలనీలో ఏడు ఇళ్లను తిరిగి పునఃప్రారంభించి వాటికి స్లాబులు వేసేందుకు తోడ్పాటునందించిన స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడితిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు అప్పాని శ్రీనివాసులు, టీడీపీ మండల కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు వీరారెడ్డి, జనరల్ సెక్రటరీ శేషురెడ్డి, సీనియర్ నాయకులు యల్లం శ్రీనివాసులురెడ్డి, గ్రామ కార్యదర్శి వలుమూడి చెన్నయ్య, ఈరి ప్రవీణ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జేసీని కలిసిన ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పులగర శోభనబాబు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పులగర శోభనబాబు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించినారు. ఈ సందర్భంగా శోభనబాబు జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రజాసత్తా 2004 నుండి ప్రజలలో, ప్రజలతో ప్రజా సంక్షేమమే పరమావధిగా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భోధన, ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలో మెను ప్రకారం మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య శ్రీ, సిఎం సహాయ నిధి పునః ప్రారంభం, గురుకుల పాఠశాలల ప్రవేశానికి లాటరీ వద్దు ప్రవేశ పరీక్షలే ముద్దు, నెల్లూరు అండర్ డ్రైనేజీ వంటి అనేక పథకాలకు ప్రజాసత్తా పునాది, కృషి చేసినట్లు గుర్తు చేశారు. గతంలో జాయింట్ కలెక్టర్లు ఇచ్చిన సహకారం మరువలేనిది అని పులగర కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుల్లగూర శీనయ్య పాల్గొన్నారు.

## రైతుల ఆసైన్డ్ భూముల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే



**రాపూరు,సెప్టంబరు26ప్రభాతవార్త :** వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలంలోని రామన్నగారిపల్లి, మాదన్నగారిపల్లిలోని దళిత రైతుల అసైన్డ్ భూముల సమస్యలను శుక్రవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రాష్ట్ర శాసన సభలో ప్రస్తావించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రామన్నగారిపల్లి, మాదన్నపల్లిగారి గ్రామాలలో వైసిపి ప్రభుత్వ హయంలో చేసిన రీ సర్వే రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ గ్రామాలలోని ఎస్సీ,ఎస్టీ,బిసి రైతులకు 30 సంవత్సరాల క్రితం 200 మందికి 400 ఎకరాలు ఢీఫారమ్ పట్టా ఇవ్వడం జరిగిందన్నారు. అప్పటి నుండి రైతులు ఈ భూములను సాగు చేసుకుంటూ, బ్యాంకుల నుండి రుణాలు కూడా పొందడం జరిగిందన్నారు.అయితే ఈ రెండు గ్రామాల రైతులు తెలుగుదేశం పార్టీ అనుకూలదారులన్న ఉద్దేశంతో అప్పటి పాలకులు రీ సర్వేలో ఈ భూములను హోల్డ్‌లో పెట్టడం జరిగిందన్నారు. రైతులు బ్యాంకులో రుణాలను రీ షెడ్యూల్ చేసుకోవడానికి వెల్లగా భూములు హోల్డ్‌లో వున్నట్లు గుర్తించి రైతులు సిసిఎల్‌కు ఫిర్యాదు చేయగా జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి ఈ భూములు తనిఖీ చేసి రికార్డులలో వారి పేర్లు నమోదు చేయాలని సిసిఎల్‌కు ప్రతిపాదనలు పంపారన్నారు. సిసిఎల్ దానికి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో రైతులు అన్నదాత సుఖీభవ పథకం పొందలేక పోయారన్నారు. దీంతో పాటు రుణాలు కూడా రెన్యువల్ చేసుకోలేక పోతున్నారని, దినిని స్పీకర్ ద్వారా రెవెన్యూ మంత్రికి తెలుపుతున్నామని వెంటనే ఈ భూమలకు సంబందించి రైతుల పేర్లు నమెదు చేయాలని ఆయన స్పీకర్ ద్వారా రెవెన్యూ మంత్రిని కోరారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అసెంబ్లీ వేదికగా చేస్తున్న కృషిని పలువురు నాయకులు అభినందిస్తున్నారు.

## పర్యావరణ హితాన్ని అందరూ కాంక్షించండి



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు అందరం కలిసికట్టుగా కృషి చేసి ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని నెల్లూరులోని ఏసీ కూరగాయల మార్కెట్లో ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. 2000 గుడ్డ సంచులను మార్కెట్లో కొనుగోలుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మనుబోలు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పుట్టిన రోజును నేడు సంతోషంగా జరుపుకుంటున్నామన్నారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని, నేడు ఏసీ మార్కెట్ వద్ద ఉన్న సాయిబాబా గుడిలో ప్రత్యేకంగా పూజలు చేశామన్నారు. ఈ సందర్భంగానే ఏసీ మార్కెట్లో గుడ్డ సంచుల పంపిణీ చేపట్టామన్నారు. మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు గుడ్డ సంచులు వాడకాన్ని అలవాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించడం జరుగుతుందన్నారు. అందరూ గుడ్డ సంచులు వాడేలా అవగాహన పెంచుతున్నట్లు తెలియజేశారు. అనంతరం ఏఎంసీ డైరక్టర్ గునుకుల విజయలక్ష్మీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని వినియోగదారులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్నామన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు గుడ్డ సంచులను అందజేసి పర్యావరణ హితాన్ని కోరుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. తదుపరి మార్కెట్ వ్యాపారుల అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ తాము కూడా గుడ్డ సంచుల పంపిణీపై ప్రజలకు అవగాహన పెంచుతామన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మరో పుట్టిన రోజు నాటికి మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు. అనంతరం మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు గుడ్డ సంచులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు కుప్పా ప్రసన్న, సాయి లక్ష్మణ్, సురేష్, మార్కెట్ వ్యాపారుల అసోసియేషన్ నేతలు అజీజ్, రామయ్య, మార్కెటింగ్ శాఖ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణా దేవిగా అంకమ్మ తల్లి



**వేపినాపి(రాపూరు),సెప్టంబరు26ప్రభాతవార్త :** భక్తుల కొంగు బంగారంగా వీరాజిల్లుతున్న రాపూరు మండలం, వేపినాపి గ్రామ దేవత శ్రీ పోతకొండ అంకమ్మ తల్లికి నిర్వహిస్తున్న దశరా శరన్నవరాత్రి ఉత్సవాలలో ఐదవ రోజైన శుక్రవారం అమ్మవారికి శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారం నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం, పూజలు, పూలాంగి సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభకర్తలుగా పాపకన్ను ప్రభాకర్ రెడ్డి ఉమామహేశ్వరీ, మన్నెం సతీష్ రెడ్డి నీలిమ, మేకపాటి పృధ్వి రెడ్డి వెంకట రజిత, కూపు ఆదిశేషా రెడ్డి అన్నపూర్ణ, చౌకచర్ల శివ ప్రసాద్ రెడ్డి అరుణ, నల్లవడ్ల మాధవ రెడ్డి కౌసల్య, చీమకుర్తి కాంతమ్మ, బద్దెవోలు రాజా రెడ్డి వెంకట పద్మావతి, కొత్తాపు వెంకట క్రిష్ణయ్య అరుణమ్మ, వద్దినేని వెంకటరత్నం నాయుడు స్రవంతి, మోడిబోయిన రామయ్య క్రిష్ణమ్మ, చల్లా వెంకయ్య రమణమ్మలు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించి, తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

# ఈ పంట నమోదు తప్పనిసరి



**కోవూరు, సెప్టెంబరు 26 ప్రభాత వార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వ్యవసాయం సాగు చేసే రైతులకు సంబంధించి ఈక్రాప్ నమోదును అక్టోబర్ 15వ తేదిలోగా నూరుశాతం పూర్తిచేసేలా ఆయా మండలాలకు సంబం ధించిన గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఐదు మండలాలకు సంబంధించిన గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ రానున్న సీజన్‌కు సంబంధించి ప్రతి రైతు తనకున్న విస్తార్ణంలో ఎంతమేర సాగు చేస్తున్నారు.. ఏయే పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాలను తప్పక గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక బుక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈపంట నమోదు సకాలంలో పూర్తిచేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. రానున్న సీజన్‌కు సంబంధించి యూరియా పంపిణీకి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఒక ప్రత్యేక కార్డు రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్డులో రైతు పేరు ఎంత విస్తార్ణంలో సాగు చేస్తున్నారు.. ఏయే పంటలు సాగు చేస్తున్నారు.. ఎంత మేర యూరియా వస్తుంది అనే విషయాలను ఈ కార్డులో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ద్వారానే ఎరువుల డిపోలోనూ, సొసైటీలోనూ యూరియా అందజేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 15వ తేది నుంచి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల్లో యూరియా వాడకంపై మరింత అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం 2800 మెట్రిక్ టన్నుల యూరియా స్టాకు ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకుల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయాధికారులు టి. రజని, ఎస్. విజయలక్ష్మి, ఎన్. శ్రీహరి, వి. శశిధర్, సీహెచ్ఎస్ లక్ష్మి, తదితరులు ఉన్నారు.

# సుశీల కేరి జయంతి సందర్భంగా పేదలకు అన్నదానం



**కావలి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** క్రిష్టియన్ పేట నివాసులు స్వర్గీయ పి. సుశీల కేరి యొక్క జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సంయుక్త సేవా సంస్థ ద్వారా కావలి పట్టణం పరిసర ప్రాంతమైన ముసునూరు వినా యక గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం చేయడం జరిగింది. సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడారు తమ యొక్క సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేసిన దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. స్వర్గీయ పి. సుశీల కేరి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ ఉన్నామని తెలియజేశారు.పి సుశీల కేరి మనవరాలు అపూర్వ, ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కార్మిక చట్ట సవరణ బిల్లును ఆపాలి



**కావలి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కార్మిక చట్ట సవరణ బిల్లును తీసుకొచ్చి కార్మికులు ఎనిమిది గంటలు చేస్తున్న పనిని పది గంటలు చేయాలని బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఉదయగిరి సెంటర్ లో అంబేద్కర్ గారి బొమ్మ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె. రెహన బేగం పాల్గొని మాట్లాడారు కార్మికులకు ఎనిమిది గంటల పని విధానాన్ని సవరించి పది గంటల విధానాన్ని తీసుకురావడం చాలా దుర్మార్గమని అలాగే ప్రైవేటు పరిశ్రమలలో అవసరాన్ని బట్టి పదమూడు గంటలు కూడా పని చేయించుకోవచ్చుని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం చాలా దుర్మార్గం అని ఇలాంటి చర్యలను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి ప్రాణాలను పణంగా పెట్టి ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకోవడం జరిగిందని తెలియజేశారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పనికి తగిన వేతనాలను అమలు చేయకుండా ఎన్నో సంవత్సరాలుగా పనులు చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా తక్కువ జీతాలు ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తుందని కార్మికుల హక్కుల కొరకు వేతనాలు కొరకు సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తూ ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకుండా పని గంటలు పెంచుతూ బిల్లులు తీసుకొని రావడం కార్మికులను ఆందోళనకు గురి చేస్తుందని తెలియజేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికులకు మేలు జరుగుతుందని ఓట్లేసి గెలిపించుకున్నారని తెలియజేశారు.ఎన్నికల అప్పుడు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి కార్మిక హక్కులను కాలరాసే విధంగా పరిపాలన చేస్తున్నదని ఆ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి కార్మికుల మీద పనిభారాన్ని పెంచడం చాలా విచారకరమని తెలియజేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేకమైన సవరణలను వెంటనే మానుకోవాలని ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని పని గంటల పెంచుతూ ప్రభుత్వాలు తీసుకొచ్చిన కార్మిక చట్ట సవరణ బిల్లులను పోరాటాల ద్వారానే అడ్డుకుంటామని తెలియజేశారు.పోరాడి సమస్యలను సాధించుకుంటామని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్నాయని ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటాలను కొనసాగించాలని పోరాటాల ద్వారానే ఈ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, వై. కృష్ణమోహన్, తిరుపాలు సీపీఎం నాయకులు మధుసూదనరావు, యూనియన్ నాయకులు జయ, బాబు, వై క్రాంతి కుమార్, కే సుభాషిణి, జయంతి కుమారి, చిన్నమ్మ, ఎల్ రాజలక్ష్మి తో పాటు మున్సిపాలిటీ, అంగన వాడి, స్కూల్ స్వీపర్సు, ఆశ, ఇతర రంగాల కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ కలుగోల శాంభవి దేవి ఆలయంలో నంది వాహన సేవ



కావలి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:శ్రీ కలుగోళ శాంభవి దేవస్థానం నందు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ కలుగోళ శాంభవి దేవిని నంది వాహనంపై ఊరేగించడం జరిగింది. అమ్మవారిని ప్రత్యేకమైన పుష్పాలతో అలంకరించి అమ్మవారికి హారతులు ఇవ్వడం జరిగింది. అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు కనువిందు కలిగించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అభిషేకాలు, హోమాలు, అర్చనలు తదితర కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. అమ్మవారి ఉత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ట్రాక్టర్ మీద అమ్మవారిని ఊరేగించడం జరిగేది. ఈ సంవత్సరం అమ్మవారిని భక్తులు లాగుతూ ఊరేగించడం జరిగింది. ఈ విధానం ఎంతో భక్తి భావంతో ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ,ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు వెంకట కృష్ణ మోహన్ లకు భక్తులు, ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

### ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కోటంరెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు సిటీ, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని నెల్లూరు ఏసీ మార్కెట్లో ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక సాయిబాబా మందిరంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కూరగాయల మార్కెట్లో పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన గుడ్డ సంచులను స్థానిక ప్రజలకు అందజేశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగులను వాడకుండా గుడ్డ సంచులను వాడాలని కోరారు. భీమతాటి సుధాకర్, గునుకుల విజయలక్ష్మి, ముఖ్యం సాయి లక్ష్మణ్, కుప్పా ప్రసన్న, సురేష్ పాల్గొన్నారు.

# నాగుల వెల్లటూరులో స్వస్ద్ నారీ సశక్త్ పరివార్



**చేజర్ల సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని నాగుల వెల్లటూరు గ్రామంలో చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యాధికారులు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వస్దనారి సశక్తి పరావార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి నవీన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మహిళలకు ఆరోగ్య సమస్యలపై పలు సూచనలు సలహాలు అందించారు. బిపి షుగర్ లెప్రసి క్యాన్సర్ పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు నరసింహారావు గ్రామ సర్పంచ్ మస్తానయ్య ,సిహెచ్ఓ వైద్యసిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ వి పాలెం లో పోషణ మాసోత్సవం



**బిట్రగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** బోగోలు మండలం ఎస్వి పాలెం లో శుక్రవారం 8 వ రాష్ట్ర స్థాయి పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైసర్ హైమావతి గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పోషకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# భారీ స్థాయిలో ఊరేగింపు



**కోవూరు, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** కోవూరులో వెలసియున్న గ్రామదేవత నాగవరపమ్మ దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు.దసరా ఉత్సవాల సందర్భంగా మూడవ రోజు శుక్రవారం గ్రామ దేవత నాగవరపమ్మకు గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక థర్మల్ స్టేషన్ ప్రాంతం నుంచి శుక్రవారం రాత్రి ఊరేగింపుగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు , డప్పుల మోతతో ఊరేగింపు సాగింది. మరో ఊరేగింపు స్థానిక పెళ్లకూరు కాలనీ ప్రాంతం నుంచి దేవస్థానం వద్దకు చేరుకుంది. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గౌడ నాయకులు బండ్ల సురేష్, బండ్ల నాగరాజు, ప్రభాకర్, శ్రీనివాసులు, రామాంజనేయులు, మల్లికార్జున, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ నిర్వహణ కమిటీ అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒబ్బారెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, న్యాయవాది ప్రసాద్, భక్తులు ఉన్నారు.

# శ్రీరామ స్మరణం.. సకల శుభప్రదం



**కోవూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** శ్రీరాముని చరిత్ర పరమ పవిత్రమైనదని , శ్రీరామ నామ స్మరణ సకల శుభప్రదమైనదని సత్యానంద ఆశ్రమ పండితుడు అవధాని కోట రాజశేఖర్ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పలు ఘట్టాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృడమైన సంకల్పాన్ని కలిగి ఉండే శ్రీరామచంద్రుడిని అయోధ్యకు తిరి రమ్మని భరతుడు చెప్పినా.. జాబాలి మహర్షిచెప్పినా.. కుల గురువు వశిష్ట మహర్షి సూచించినా.. పితృవాక్య పరిపాలన దక్షుడైన రామచంద్రుడు 14 సంవత్సరాలు వనవాసం చేయాలని నిశ్చయించుకున్నారన్నారు. ఈ కారణంగానే వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రుడిని దృఢవ్రతుడని కీర్తించారన్నారు. ఇంతటి సుగుణాభిరాముడైన శ్రీరామచంద్రుడు సతాదేవితో కూడి తమ్ముడితో కలిసి వనవాసం చేస్తుండగా సూర్పనక అనే రాక్షసి ముక్కు చెవులను లక్ష్మణుడు ఖండించారన్నారు. సూర్పనక మాటలు విన్న రావణుగు మారీచుని సహాయంతో సీతను అపహరించి తనను ఎదిరించిన జటాయు రెక్కలు కూడా ఖండించారన్నారు. ఈ సందర్భంగా రామాయణంలోని అరణ్యకాండం ఘట్టాన్ని అవధాని కోట రాజశేఖర్ తన ప్రవచనాల్లో భక్తులకు విశదీకరించారు. గత 5 రోజులుగా రామాయణంలోని బాల కాండను, అయోధ్య కాండను, అరణ్య కాండను విశదీకరించి చెప్పిన అవధాని కోట రాజశేఖర్‌ను సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, శ్రీ రామతీర్థ స్వామి, శ్రీ పురుషోత్తమ తీర్థ స్వామీ, ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు పలు విషయాలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కావలి ఏరియా వైద్యశాలలో గర్భకోశ క్యాన్సర్ పరీక్షలు



**కావలి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** స్వస్థనారి సాక్షిత్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కావలి ఏరియా వైద్యశాల నందు శుక్రవారం కావలి పట్టణ మరియు పరిసర ప్రాంతాల మహిళలకు గర్భకోశ క్యాన్సర్ పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ అనూష, ఆర్.ఎం.ఓ డాక్టర్ ప్రమీల, గైనకాలజిస్ట్ డాక్టర్ వెంకటలక్ష్మి, వైద్యులు డాక్టర్ విజయవాణి, డాక్టర్ సుబ్బారెడ్డి,డాక్టర్ వెంకట్ రెడ్డి లు పాల్గొని మాట్లాడారు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించుకోవడం వలన ఎంతో ఉపయోగం ఉందని తెలియజేశారు. ఈ పరీక్షల వలన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు.ఈ పరీక్షలను 30 సంవత్సరాలు పైబడిన మహిళలు తప్పనిసరిగా చేసుకోవాలని తెలియజేశారు. ఒక మహిళ బాగుంటే కుటుంబం మొత్తం బాగుంటుందనే విధానంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వస్థనారి సాక్షిత్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు

## నుడా లో ముందస్తు దసరా వేడుకలలో హాజరైన చైర్మన్ కోటంరెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త:** హిందువులకు అంత్యంత ముఖ్యమైన పండుగల్లో దసరా ఒకటి అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో ముందస్తు దసరా వేడుకలు జరిగాయి. నుడా అధికారులకు, సిబ్బందిలకు కోటంరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ మాట్లాడుతూ శరన్నవరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరించి పూజిస్తారని , మహిళలు శక్తి స్వరూపిణులు అని అయన అన్నారు. నుడా లో ఉండే మహిళా ఉద్యోగులు కార్యాలయానికి విజయవంతంగా నడపాలన్నారు. జిల్లా ప్రజలకు నుడా ద్వారా మెరుగైన పాలన అందించేందుకు అందరూ కష్టపడి పని చెయ్యాలన్నారు. ఈ విజయదశమి రాష్టంలో నూతన వెలుగులు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో.. యువనేత మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు వెళుతుందని ఆయన అన్నారు. ఈ ముందస్తు దసరా వేడుకలలో పెంచల్ రెడ్డి, పిఓ హిమబిందు, కాలేశా, ఏవో రాజు, ఈ ఈ చంద్రయ్య, మనోహర్, ఎపీఓ కుముదుని, చంద్ర తదితరులు పాల్గొన్నారు అధికారులు పాల్గొన్నారు.

# కొత్త సత్రం గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు



**కావలి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం, కొత్తసత్రం గ్రామంలో కావలి మండల న్యాయధికారిక సంస్థ చైర్మన్ ఏ.గీత వాణి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు ను శుక్రవారం నిర్వహించడం జరిగింది.గ్రామంలో ని ప్రజలకు లోక్ అదాలత్ యొక్క సేవలు, ఉపయోగాల వంటి అంశాలపై ప్రజలకు కావలి మం డల లీగల్ ఎయిడ్ మెంబరు, న్యాయవాది ఐ.సాయి ప్రసాద్ మరియు లీగల్ నెంబర్ యం. మాలకొండారెడ్డిలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు ఆర్థిక లావాదేవీలు, భూముల కొనుగోలు విషయం లో న్యాయపరమైన సలహాలు, మైనర్ వివాహాలు వాటి పరిణామాలు మొదలగు చట్టాల గురించి తెలియజేయడం జరిగింది. అక్కడ వున్న వృద్ధులకు ఎలాంటి ఆసరలు, చట్టాలు వున్నాయి అనే అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా పెద్దల పట్ల గౌరవంగా వుండాలి అని వారిని కించపరచడం, చులకన చేయకూడదు అని తెలియజేశారు.కాలనీలో వున్న పిల్లలు అందరిని బడికి పంపించాలి అని, సమాజంలో గౌరవంగా జీవించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మి నారాయణ, యానది, శ్రీనివాసులు, హరిబాబు,శీత స్తానిక ప్రజలు పాల్గొన్నారు.

# మాతా శిశు మరణాలను సహించను



**నెల్లూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం :** ప్రభుత్వ వైద్యశాలల్లో మాతా శిశు మరణాలు సంభవిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ వి.సుజాత హెచ్చరించారు. నెల్లూరులోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ వి.సుజాత అధ్యక్షతన మాతా శిశు మరణాల సబ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీని గుర్తించి నమోదు చేయడంతో పాటు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి, సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించి సుఖ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలాగా మందస్తు ప్రణాళిక రూపొ ందిం చుకోవాలని,అర్హులైన ప్రతి గర్భిణీ స్త్రీకి , బాలింతకు జేఎస్‌వై అండ్ జేఎస్ఎస్‌కే పథకాల క్రింద లబ్ది చేకూరేలాగా చూడాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. రక్తహీనతతో మాతా శిశు మరణాలు సంభవిస్తే సహించేది లేదన్నారు. జిల్లాలో గత జులై , ఆగష్టు నెలల్లో 2025 1మాతృ మరణం, 9 శిశు మరణాలపై గల కారణాలు లోపాల గురించి క్షుణ్ణంగా సమీక్ష చేశారు. ఈ సబ్ కమిటీ సమీక్షా సమావేశంలో డాక్టర్ పరిమళ డీసీఎస్, డాక్టర్ గీతాలక్ష్మీ హెచ్ఓడీ(గైనిక్) జీజీహెచ్, డాక్టర్ విజయ్ అనస్తీషియా ప్రొఫెసర్,డాక్టర్ జి.గ్రేస్ ప్రియాంక అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ ఏసీఎస్ఆర్ మెడికల్ కాలేజీ,డాక్టర్ ఏ.ఉమా మహేశ్వరి డీఐఓ,జీజీహెచ్ పీడీయాట్రీషన్స్ డాక్టర్ రామ్ కిషోర్,డాక్టర్ సంధ్య,డాక్టర్ ఎం.రమేష్ ,డీపీఎం ఓ.కే.కనకరత్నం డెమో, టి.అరుణ సీడీపీఓ నెల్లూరు, జ్యోతి సీహెచ్ఓ, మార్గెట్ డీఎస్ఓ,వి.ప్రేమలత ఎంపీహెచ్ఎస్(ఎఫ్),సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయం-2లో శుక్రవారం స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు, బాలింతలకు, మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనమడుగు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల్లో మహిళలు తమ ఆరోగ్యానికి సంబంధించిన వైద్యుల వద్ద చూపించుకుని తగు సలహాలు పొందాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఐరన్ లోపం ఉంటే గర్భవతులకు కాన్పులు కూడా కష్టమవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాలు, పండ్లు, ఆకుకూరలను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ను పరిశీలించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఆయాలు ఉన్నారు.

# ఒకేషనల్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు,సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** బాలికలు భవిష్యత్తులో స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించేందుకు బాలికోన్నత పాఠశాలల్లో ఎస్ఎస్ఏ ద్వారా ప్రత్యేక కోర్సులను ఏర్పాటు చేయడం జరిగిందని వాటిని వారు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకో వాలని జీసీడీవో మమత అన్నారు. కోవూరులోని బ్యూటీ పార్లర్‌లో పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బ్యూటీషియన్ కోర్సులకు సంబంధించి పలు ప్రాక్టికల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యూటీషియన్ కోర్సు, ఐటీ , బేకరి, తదితర రంగాలపై బాలికలు దృష్టి పెట్టి వారికి ఉపయోగపడే ఒకేషనల్ కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు బాలికలు మెహందీ ఏ విధంగా పెట్టాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈకార్యక్రమంలో పాఠశాలకు చెందిన బ్యూటీషియన్ కోర్సు ఇన్‌చార్జి రజని ముఖర్జీ, తదితరులు ఉన్నారు.

# సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాల్లో సంపద సృష్టించడంలో అలసత్వం లేకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ సీఈవో మోహన్‌రావు అన్నారు. కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామ పంచా యతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామాలు స్వచ్ఛగ్రామాలుగా మారేందుకు సహకరించాలన్నారు. ఇంట్లోని చెత్తను తడి చెత్త పొడి చెత్త రూపంలో వేరువేరుగా మీ ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. ఆ చెత్తను ఉపయోగించుకుని సంపద కేంద్రాల్లో రైతులకు ఉపయోగపడే ఎరువును తయారు చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి కరుణ, తదితరులు ఉన్నారు.

# ఘనంగా దసరా వేడుకలు లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన చింతాలమ్మ తల్లి



**చేజర్ల సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** చేజర్ల మండలం యనమదల గ్రామంలో వెలసి వున్న శ్రీ చింతాలమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా ఐదవరోజు శుక్రవారం లలితా దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉభయకర్తలు యనమదుల గ్రామానికి చెందిన మల్లినేని వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహారించారు. ఉదయం పొంగళ్ళు పొంగించి నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వెంకటేశ్వర్లు ఆచారి ఆలయంకు విచ్చేసినటువంటి భక్తులకు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులందరికి తీర్ద ప్రసాదాలు అందజేశారు. అనంతరం సాయింత్రం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో ఉభయకర్తలు,యనమదల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు



**సీతారామపురం సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** ప్రభుత్వ భూమిపై ప్రవేటు వ్యక్తుల పెత్తనం తగదని తహసిల్దారు షేక్,ఫజిహా హెచ్చరించారు.సీతారామపురం మండలంంలోని సింగారెడ్డిపల్లి బిసి కాలనీలో ప్రభుత్వ భూమిపై తలెత్తిన వివాదంపై శుక్రవారం ఆమె రెవిన్యూ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సింగారెడ్డిపల్లి సర్వే నెంబర్ 96లో ఉన్న పంచాయితీకి చెందిన ప్రభుత్వ భూమిని స్దానికులు ఉపయోగించుకుంటు ఇతరులకు ఇబ్బంది కలిగేలా చేయడం మంచి పద్దతి కాదని అన్నారు.భూ ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఫిర్యాది దారుడి ఇంటి ముందు వున్న ప్రభుత్వ భూమిపై అడ్డుగా ఉన్న మిల్లర్లు,పలు వాహనాలను నిలిపి ఇంట్లోకి వెళ్ళేందుకు ఇబ్బంది కలిగిస్తున్నాడని ఫిర్యాదు కారణంగా విచారణ చేపట్టామని ఫిర్యాదు దారుడు ఇంటి ముందు నిలిపిన వాహనాలను తొలగించామని అన్నారు. ఇరువర్గాల మద్య తలెత్తిన భూ వివాదంపై చర్యలలో భాగంగా ప్రభుత్వ భూమిని ఇరువురు వాడుకునేందుకు వీలు లేదని హెచ్చరికలు జారి చేశామన్నారు.ప్రభుత్వ భూములను తాత్కాలిక అవసరాలకు వాడుకోవడం తప్ప శాశ్వితంగా ఆక్రమించుకునే పరిస్దితులు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈకార్యక్రమంలో ఆర్ఐ సుభానీ,సర్వేయర్ శ్రీకాంత్, విఆర్ఓ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతి సంస్మరణ సభ



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** ఉద్యోగుల శ్రేయస్సు కొరకు అహర్నిశలు శ్రమించి.. ఉద్యమ బాటలో ప్రాణాలర్పించిన సింహపురి టైగర్ కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 27 వ తేది ఉదయం 8.00 గంటలకు భక్తవత్సల నగర్, నెల్లూరు నందలి గిరిజన భవనం ప్రక్కన గల నూతన రెవెన్యూ భవన స్థలం నందు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ అమరావతి తరపున ప్రతిష్టించబడ్డ కాంస్య విగ్రహం వద్ద కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతి సంస్మరణ సభ జరుగుతుందని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ మహనీయునికి ఘనమైన నివాళులు అర్పించడం జరుగుతుంది అని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి ఓ ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



**నెల్లూరు,సెప్టెంబర్ 26, ప్రభాతవార్త –వైద్యం :** రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజా నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రాజా నాయుడు ఆధ్వర్యంలో బాలింతలకు, రోగులకు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా నాయుడు మాట్లాడుతూ మా ప్రియతమ నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆ దైవాన్ని ప్రార్ధిస్తున్నట్లు చెప్పారు. నిండు నూరేళ్ల చల్లగా జీవించి ప్రజలకు సేవలు అందించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నేత సుందరరామిరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరక్టర్ మొగరాల సురేష్, ఇతర నేతలు రఘురామయ్య, మునిశేఖర్ నాయుడు, ఆకుల రాజేష్, జంగం సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, షరీఫ్, శ్రీను, చరణ్, భాష, శ్రీనివాసులు, అనుమల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

